ప్రజాశక్తి
సోమవారం 22 జనవరి 2024 5 అనంతపురం

సమ్మెను అణచి వేస్తే ప్రభుత్వ పతనం ఖాయం

ప్రజాశక్తి - అనంతపురం

తమ సమస్యల పరిష్కారం కోసం 41 రోజులుగా సమ్మె చేస్తున్న అంగన్వాడీల డిమాండ్లు పరిష్కరించకుండా ప్రభుత్వం నియంతృత్వంగా వ్యవహరిస్తోందని సిపిఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్ విమర్శించారు. ఉరవకొండ, యల్లనూరు ప్రాంతాల్లో సమ్మె శిబిరాలను పోలీసులు తొలగించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అంగన్వాడీల సమ్మెకు మద్దతుగా కోటి మంది ప్రజలతో సేకరించిన సంతకాలను ముఖ్యమంత్రికి ఇవ్వడానికి బయలుదేరుతున్న అంగన్వాడీల ఇళ్ల వద్దకు వెళ్లి పోలీసులు నోటీసులు ఇవ్వడం ప్రభుత్వ నియంతృత్వానికి పరాకాష్ట అన్నారు. ఐసిడిఎస్ అధికారులు, వైసిపి స్థానిక నేతలు ఫోన్ లో ద్వారా అంగన్వాడీ కార్యకర్తలను బెదిరిస్తున్నారని విమర్శించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలు కోరడం అంగన్వాడీలు చేసిన నేరమా అని ప్రశ్నించారు. కార్మికులంటే బానిసలు కాదని పాలకులు గుర్తించాలన్నారు. అంగన్వాడీల సమ్మె ను అణిచివేస్తే రాష్ట్ర ప్రభుత్వ పతనం ఖాయం అన్నారు. సమ్మె అనేది కార్మికుల ప్రాథమిక హక్కు అని దాన్ని నిరాకరిస్తే ప్రజాస్వామ్యానికి అర్థం లేదని అన్నారు. అంగన్వాడీల న్యాయమైన సమ్మె కు అన్ని వర్గాల ప్రజలు అండగా నిలవాలని, ప్రభుత్వ నిర్బంధాన్ని ఖండించాలని ఆయన కోరారు.

అంగన్వాడీలతో దురుసుగా ప్రవర్తిస్తున్న పోలీసులు

అంగన్వాడీలపై నిర్బంధం

మంత్రిని అడ్డుకున్నారని కేసులు నమోదు
పలుచోట్ల బలవంతంగా శిబిరాల తొలగింపు
చలో విజయవాడ వెళ్లొద్దంటూ నోటీసులు

అంగన్వాడీలను హెచ్చరిస్తున్న పోలీసులు

పోలీస్‌స్టేషన్‌లో ఉన్న సిఐటియు, అంగన్వాడీ నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

తమ సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీలు 41 రోజులుగా సమ్మె చేస్తున్న విషయం తెలిసిందే. ఈ సమ్మెపై ప్రభుత్వం నిర్బంధాన్ని పెంచేందుకు సిద్ధమైంది. దీక్ష శిబిరాలను తొలగించే ప్రయత్నం ఒకవైపు చేస్తూనే చలో విజయవాడకు వెళ్లకుండా అడ్డుకునేందుకు పోలీసులు ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తున్నారు. ముందస్తు అరెస్టులకు సిద్ధమవుతున్నారు.

మంత్రి పర్యటన అడ్డుకున్నారని పది మందిపై కేసులు

ఉరవకొండలో జరుగుతున్న ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లు చూసేందుకెళ్లిన జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి అంగన్‌వాడీ కార్మికులు వినతిపత్రం ఇవ్వడానికి వెళ్లారు. అయితే ఆయన వినతిపత్రం తీసుకోవడానికి ముందుకు రాకపోవడంతో కాన్వాయ్‌కు అడ్డంగా కూర్చున్నారు. దీనిపై పోలీసులు పదిమందిపై కేసు నమోదు చేశారు. తహాశీల్దారు ఫిర్యాదు మేరకు ఉరవకొండ పోలీసులు పది మందిపై కేసులు నమోదు చేసినట్టు సమాచారం. అయితే అధికారులెవరూ దీన్ని ధ్రువీకరించడం లేదు. సిఐటియు నాయకులు మధుసూదన్, రంగారెడ్డి, ఎఐటియుసి నాయకులు చంద్రాయుడుతోపాటు మరికొంత మందిపై కేసు నమోదయినట్టు సమాచారం. అంతేకాకుండా ఉరవకొండలో దీక్షా శిబిరాన్ని శనివారం రాత్రి పోలీసులు తొలగించారు.

దీక్షా శిబిరాల తొలగింపు

ఉమ్మడి అనంతపురం జిల్లాలో అంగన్‌వాడీలు చేపడుతున్న దీక్షా శిబిరాలను తొలగించాలని పోలీసులు ఒత్తిళ్లు పెంచుతున్నారు. ఉరవకొండలో ఇప్పటికే తొలగించగా, పెద్దవడుగూరు, యల్లనూరు మండలాల్లోనూ వీటిని ఆదివారం తెల్లవారేలోపు తొలగించేశారు. అన్ని చోట్లా తొలగించాలని ఒత్తిడి పెంచుతున్నారు. తొలగించకుంటే చర్యలుంటాయని హెచ్చరికలు సైతం పోలీసులు జారీ చేస్తుండటం గమనార్హం.

చలో విజయవాడ అడ్డుకునేందుకు నోటీసులు ,అరెస్టులు

41 రోజులుగా అంగన్‌వాడీలు దీక్షలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోక పోవడంతో చలో విజయవాడ కార్యక్రమాన్ని అంగన్‌వాడీలు చేపట్టారు. అయితే విజయవాడకు వెళ్లడానికి వీల్లేదంటూ పోలీసులు అంగన్‌వాడీ వర్కర్సు అండ్ హెల్పర్సు యూనియన్ నాయకులు, కార్యకర్తలకు నోటీసులు జారీ చేస్తున్నారు. హిందూపురంలో ప్రాజెక్టు కార్యదర్శి లావణ్యకు నోటీసులివ్వడమే కాకుండా అరెస్టు చేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు. కెవిపిఎస్ నాయకులు రమణను కూడా అరెస్టు చేశారు. ఆదివారం రాత్రికి మరింత మందిని అరెస్టు చేయడానికి పోలీసులు సమయత్తమయ్యారు.

హిందూపురం రైల్వేస్టేషన్‌లో పహారా కాస్తున్న పోలీసులు

లెనిన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

దోపిడీ లేని సమాజ సాధనకు

లెనినిజం మార్గదర్శకం

లెనిన్ శత వర్ధంతిలో నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

దోపిడీ లేని సమాజ స్థాపనకు మార్క్సిజంతోపాటు లెనినిజమే శిరోధార్యమని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఓ.నల్లప్ప, ఎం. బాలరంగయ్య, ఎస్.నాగేంద్రకుమార్ అన్నారు. లెనిన్ శత వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం నగరంలోని గణేనాయక్ భవన్‌లో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కామ్రేడ్ లెనిన్ మార్క్సిస్టు సిద్ధాంతాన్ని నిర్దిష్ట పరిస్థితుల్లో, నిర్దిష్టంగా అమలు చేయడం ఎలాగో కార్మికవర్గానికి బోధించారన్నారు. ప్రపంచంలోనే తొలి సోషలిస్టు విప్లవాన్ని సాధించిన మహా విప్లవనేత లెనిన్ అన్నారు. అలాంటి ఆయన వర్ధంతిని ప్రపంచం అంతా జనవరి 21న జరుపుకువటుందన్నారు. మార్క్స్-ఎంగెల్స్, సిద్ధాంతానికీ, ఆచరణకూ మధ్య ఉన్న గతితార్కిక సంబంధాన్ని ఆచరణలో చూపించిన ఘనత లెనిన్‌కు దక్కుతుందన్నారు. విప్లవం విజయం సాధించాలంటే కార్మికవర్గం తన సహజ మిత్రులైన రైతాంగాన్ని ఉద్యమోన్ముఖులను చేయటం అనివార్యం అని గుర్తించి కార్మిక, కర్షక మైత్రికి సైద్ధాంతికంగా, ఆచరణాత్మకంగా పునాదులు వేసిన వ్యూహకర్త లెనిన్ అన్నారు. కమ్యూనిస్టు పార్టీకి మిగిలిన పార్టీలకంటే భిన్నంగా తనదంటూ నిర్మాణం, విలక్షణత, వ్యక్తిత్వం, క్రమశిక్షణ, ప్రమాణాలు ఉండాలని సవాలు చేసి నిరూపించిన సాహసి అని కొనియాడారు. పెట్టుబడిదారీ వ్యవస్థ సామ్రాజ్యవాద దశకు చేరిన విషయాన్ని లెనిన్ బయటపెట్టడమే కాదు.. దేశభక్తి పేరుతో సామ్రాజ్యవాద యుద్ధాలను సమర్థించే రివిజనిస్టుల నుండి విప్లవోద్యమాన్ని కాపాడారన్నారు. 1905 తొలి తిరుగుబాటు యత్నం అర్ధాంతరంగా ముగించాల్సి వచ్చినపుడు లెనిన్ 'అధైర్యపడవద్దు.. ఈ చీకటి రోజులు తొలగిపోతాయి.. గాలి దుమారం సమసిపోతుంది... నిప్పు కణికలు చల్లబడతాయి... మరోసారి ముందుకు వేగంగా వస్తుంది' అంటూ ధైర్యాన్ని నూరిపోశారన్నారు. అందువల్లే లెనిన్ నూతన శకానికి విప్లవంతో స్వాగతం చెప్పిన శకపురుషుడుగా చరిత్రలో స్థానం పదిలం చేసుకున్నారన్నారు. సామ్రాజ్యవాద గుత్త పెట్టుబడి, అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి రూపం సంతరించుకుని ప్రపంచ ప్రజలను పీల్చి పిప్పి చేస్తున్న నేటి తరుణంలో లెనిన్‌ను అధ్యయనం చేయడం, ఆకళింపు చేసుకోవడం, ఆవాహన చేసుకోవడం విప్లవ శక్తులకు తక్షణ అవసరమని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు నాగమణి, వై.వెంకటనారాయణ, ముస్కిన్, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీలకు కన్నీళ్లు తెప్పించే జగన్ మాకొద్దు

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్

కోటి సంతకాలు సేకరిస్తున్న అంగన్వాడీలు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అంగన్వాడీ అక్కచెల్లెమ్మలకు కన్నీళ్లు పెట్టిస్తున్న జగన్ సర్కార్ తమకు వద్దని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో చేపట్టిన కోటి సంతకాల సేకరణ ఆదివారం నగరంలో కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వయానా సిఎం జగన్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ అంగన్వాడీలు 41 రోజులుగా సమ్మె చేస్తుంటే ప్రభుత్వం కనికరించకపోవడం బాధాకరమన్నారు. అంతేగాకుండా సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం పరిష్కరించకపోగా ఎస్మా ప్రయోగించడం ఎంత వరకూ సమంజమని ప్రశ్నించారు. ఇలాంటి ముఖ్యమంత్రిని గతంలో ఎన్నడూ చూడలేదన్నారు. ప్రజలు ఇంటికి సాగనంపే రోజులు దగ్గర పడ్డాయన్నారు. ఉరవకొండలో అంగన్వాడీల పట్ల పోలీసుల తీరు చాలా అభ్యంతరం అన్నారు. ఈ ఘటనపై మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. పోలీసులు ప్రజలకు సేవ చేస్తున్నారో.. ప్రభుత్వానికి కొమ్ము కాస్తున్నారో అర్థం కాని పరిస్థితి నెలకొందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఎలాంటి షరతులు లేకుండా చర్చలకు ఆహ్వానించి సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. అలాగే జిల్లావ్యాప్తంగా అంగన్వాడీలకు ఉరవకొండ, విజయవాడకు వెళ్లొద్దని నోటీసులు జారీ చేయడంతోపాటు ఉరవకొండ, యల్లనూరు, పెద్దవడుగూరు ప్రాంతాల్లో అంగన్వాడీలు వేసుకున్న టెంట్లు తొలగించడం మంచిది కాదన్నారు. ఇంత నిర్బంధం ఎమర్జెన్సీ రోజుల్లో కూడా లేదేమో.. అన్నారు. ప్రభుత్వం తీరు మార్చుకోకపోతే పోరాటం మరింత తీవ్రతరం అవుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు జమున, అరుణ, రుక్మిణీ, పార్వతి, రమాదేవి, షబానా, సిఐటియు నాయకులు రామాంజనేయులు, వెంకటనారాయణ, బాల రంగయ్య, పోతులయ్య, ఎస్ఎఫ్ఐ నాయకులు గిరి, తదితరులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి

యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోవిందరాజులు, లింగమయ్య

పోస్టర్లను విడుదల చేస్తున్న యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించేంత వరకూ పోరాటాలు చేస్తూనే ఉంటామని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోవిందరాజులు లింగమయ్య స్పష్టం చేశారు. ఆదివారం జిల్లాకేంద్రంలోని యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో జిల్లా ఆఫీస్ బేరర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2004 సెప్టెంబర్ తర్వాత ప్రభుత్వ ఉద్యోగులుగా చేరిన వారందరికీ పాత పెన్షన్ స్థానంలో కంట్రిబ్యూటరీ పెన్షన్ పథకం అమలులోకి వచ్చిందన్నారు. ఈ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ తమకు వద్దని, పాత పెన్షన్ పునరుద్ధరించాలని ఇప్పటికే పెద్ద ఎత్తున ఉద్యోగ, ఉపాధ్యాయులు పోరాటం చేశారని, చేస్తూనే ఉన్నారనారు. జగన్‌రెడ్డి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తాను అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లో పాత పెన్షన్ అమలు చేస్తానని వాగ్దానం చేశారన్నారు. అయితే అధికారంలోకి వచ్చి నాలుగున్నరేళ్ల పూర్తయినా పట్టించుకోలేదన్నారు. అంతేగాకుండా జీపీఎస్ విధానాన్ని తీసుకొచ్చి 50శాతం పెన్షన్‌ను అదనంగా డిఎ ఇస్తామని చెబుతున్నారన్నారు. సిపిఎస్ అయినా, జిపిఎస్ అయినా ఉద్యోగ, ఉపాధ్యాయులకు నష్టదాయకమన్నారు. కావున పాత పెన్షన్ విధానాన్నే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆయా సమస్యల పరిష్కారానికి అన్ని రాజకీయ పార్టీలతో ఈనెల 28 రాజమండ్రిలో సభ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ గౌరవాధ్యక్షులు రమణయ్య, సహా అధ్యక్షులు రామప్పచౌదరి, సహాధ్యక్షురాలు సరళ, జిల్లా కోశాధికారి రాఘవేంద్ర, రాష్ట్ర కౌన్సిలర్లు ఈశ్వరయ్య, దేవేంద్రమ్మ, జిల్లా కార్యదర్శి ప్రమీల, రఘురామయ్య, శేఖర్, ఆడిట్ కమిటీ కన్వీనర్ సుబ్బరాయుడు, తదితరులు పాల్గొన్నారు.

'చిరు' కాదు 'సిరి' ధాన్యాలు

'అనంత'చిరుధాన్యాల పండుగలో వక్తలు

సదస్సులో మాట్లాడుతున్న వక్తలు

ప్రజాశక్తి-అనంతపురం

చిరుధాన్యాలు అంటే తక్కువన్న భావన ఉందని, అవి అందరూ అనుకున్నట్టు చిరుధాన్యాలు కాదని సిరి ధాన్యాలు అని వక్తలు పేర్కొన్నారు. అనంతపురం నగరంలోని ఆర్ట్సు కళాశాల మైదానంలో 'చిరు ధాన్యాల పండుగ' పేరుతో పలు స్వచ్ఛంద సంస్థలు సంయుక్తంగా నిర్వహిస్తున్న మేళా ఆదివారం నాటికి రెండవ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ రకాలైన గ్రామీణ సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. అదే విధంగా వివిధ రకాల చిరుధాన్యాలతోపాటు, చిరుధాన్యాలతో చేసిన వంటకాల రుచులు అక్కడ లభించాయి. ఆదివారం సెలవు కూడా కావడంతో అనేక మంది నగరవాసులు ఈ మేళాలోకి వచ్చి ఆసక్తిగా తిలకించారు. కొన్ని రకాల వంటల రుచులను కూడా చూశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో పలువురు ప్రముఖులు పాల్గొని తమ సందేశాలను ఇచ్చారు. ఎఎఫ్ ఎకాలజీ డైరెక్టరు వై.వి.మల్లారెడ్డి మాట్లాడుతూ పాశ్చాత్య అలవాట్లు ప్రారంభమయ్యాక మనకు ముందు నుంచి ఉన్న సంస్కృతి, సాంప్రదాయాలు కనుమరుగవుతున్నాయి. ఇందులో ప్రధానంగా ఆహారపు అలవాట్లలో అనేక మార్పులొచ్చేశాయమన్నారు. పిజ్జా, బర్గర్ల వంటివి సులభంగా ఇంటి వద్దకే చేరుతున్నాయన్నారు. దీంతో ముందు నుంచి వస్తున్న ఆహారపు అలవాట్లు మారిపోయాయని చెప్పారు. అయితే ఇటీవలి కాలంలో పెద్దపెద్ద నగరాల్లో పాత పద్ధతుల్లోకి వస్తున్నారని అందులో భాగంగా చిరుధాన్యాల వాడకం పెరుగుతూ వస్తోందని అన్నారు. కాని గ్రామీణ ప్రాంతాల్లో మాత్రం దీని వాడకం తగ్గిందన్నారు. ఇక్కడా వాడే విధంగా అవగాహన కల్పించాల్సిన అవసరముందని వివరించారు. వ్యవసాయ శాస్త్రవేత్త చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ పరిశోధానా క్షేత్రాల ద్వారా అనేక కొత్తరకాలైన చిరుధాన్యాలను తీసుకురావడం జరిగిందని తెలిపారు. ఒక్క కొర్రలోనే ఆరు రకాలైన విత్తనాలు అందబాటులో ఉన్నాయన్నారు. అనంతపురం జిల్లాలోనూ సజ్జ మేలు రకం తయారు చేయడం జరిగిందని పేర్కొన్నారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం వచ్చే విధంగా కొత్త రకాలైన చిరుధాన్యాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ జర్నలిస్టు కూర్మనాథ్, టింబక్టు ప్రతినిధి సన్నప్పయ్య, రెడ్స్ సంస్థ ప్రతినిధి భానుజ, జనజాగృతి సంస్థ ప్రతినిధి బలరాం, కుడ్యము ప్రతినిధి విజయ భాస్కర్, కార్డు ప్రతినిధి నిర్మలారెడ్డి, ఎఎఫ్ ఎకాలజీ ప్రతినిధి మురళీకృష్ణ, మీడియా కో ఆర్డినేటర్ రమేష్ సుసర్ల తదితరులు పాల్గొన్నారు.

సిఎం జగన్ పర్యటనపై ఎస్పీతో చర్చిస్తున్న కలెక్టర్ గౌతమి

సీఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి-ఉరవకొండ

వైఎస్ఆర్ ఆసరా కార్యక్రమంలో పాల్గొనేందుకు ఈనెల 23న వస్తున్న సిఎం జగన్ పర్యటన ఏర్పాట్లను కలెక్టర్ గౌతమి, ఎస్పీ కెకెఎన్ అన్బురాజన్, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి పరిశీలించారు. ఇందులో భాగంగా పట్టణంలోని అనంతపురం రోడ్డులో ఉన్న భారత్ పెట్రోల్ బాంక్ వద్ద ఏర్పాటు చేయనున్న సభాస్థలిలో ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం జూనియర్ కళాశాలలో హెలిప్యాడ్‌ను పరిశీలించి అధికారులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లను పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ జిల్లాల జోనల్ ఇన్‌ఛార్జి ప్రణయ్‌రెడ్డి, ఆర్టీసీ రీజినల్ డైరెక్టర్ మంజుల, జెడ్పీ సిఇఒ వైఖోమ్ నిదియా దేవి, అనంతపురం నగరపాలక సంస్థ కమిషనర్ మేఘస్వరూప్, అదనపు ఎస్పీలు విజయ్‌భాస్కర్‌రెడ్డి, హనుమంతు, ఆర్‌డిఒలు వి.శ్రీనివాసులురెడ్డి, రాణీ సుస్మిత, తహశీల్దార్ శ్రీధర్‌మూర్తి, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వ పథకాలు

మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఈడీ ఎస్‌పి. మధుసూదన్

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

మైనార్టీ సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పలు పథకాలను అమలు చేస్తోందనిస్టేట్ మైనార్టీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్‌పి. మధుసూదన్ పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాలకు కలిపి అనంతపురం కేంద్రంగా పనిచేస్తున్న ఈ శాఖ ద్వారా పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. మైనార్టీ సంక్షేమ శాఖతో పాటు తమ కార్పొరేషన్ ద్వారా ప్రభుత్వం పలు పథకాలను అమలు చేస్తోందన్నారు. సత్యసాయి జిల్లాలో 2.11 లక్షల మంది మైనార్టీలు ఉన్నారన్నారు. ఇందులో ముస్లింలు, క్రిస్టియన్లు ఉన్నారన్నారు. ప్రభుత్వం మైనార్టీ కుటుంబాల కోసం ప్రత్యేక పాఠశాలలు ఏర్పాటు చేయడమే గాక విద్యార్థులకు కూడా వైఎస్ఆర్ విద్యా కానుక, వసతి దీవెన లాంటి పథకాలు అమలు చేస్తోందన్నారు. ఈ నేపథ్యంలో జిల్లా మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్‌పి మధుసూదన్ మైనార్టీలకు అందిస్తున్న పథకాలపై ప్రజాశక్తికి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో పలు అంశాలను వెల్లడించారు.

ప్రశ్న : సత్యసాయి జిల్లాలో మైనార్టీలకు ఇస్తున్న పథకాలు ఏవి ?

జవాబు : జిల్లాలో సుమారు 2.11 లక్షల మంది మైనార్టీలు ఉన్నారు. ఆయా కుటుంబాలకు వ్యక్తిగత రుణాలు అందిస్తున్నాము. పౌర సరఫరా శాఖ అందిస్తున్న నిత్యావసర సరుకులను లబ్ధిదారులకు అందించడానికి ప్రత్యేక వాహన సదుపాయం మొబైల్ డిస్పెన్స్ యూనిట్ వాహనాలు (ఎండియు) కొనుగోలు పై 90 శాతం సబ్సిడీతో 32 వాహనాలను మైనార్టీలకు పంపిణీ చేశాం. ఒక్కొక్క వాహనం 5.80 లక్షలు ఖరీదు చేస్తోంది. వీటి వల్ల మైనార్టీ సోదరులు వారి కుటుంబాలను పోషించుకునే అవకాశం కల్పించాం. ఇందుకు ప్రభుత్వం 2.38 కోట్లు మంజూరు చేసింది. వైయస్సార్ చేయూత పథకం ద్వారా 45 నుండి 60 సంవత్సరాల వయసు కలిగిన మహిళలకు రుణాలు అందిస్తున్నాము. ప్రతి ఏటా 18,750 రూపాయల ప్రకారం ఇప్పటివరకు మూడు విడతల్లో 8,249 మందికి అందించాం. నాలుగవ విడత నిధులు మంజూరుకు జిల్లా కలెక్టర్ కు ప్రతిపాదనలు పంపాం. త్వరలో 4వ విడత మంజూరు అయ్యే అవకాశం ఉంది. ఈ నాలుగు విడతలు కలిపి ఒక్కొక్కరికి రూ. 75 వేలు అందించడమే ప్రభుత్వం లక్ష్యం. ఈ మొత్తం పూర్తిగా ఉచిత ఆర్థిక సహాయంగా ప్రభుత్వం అందిస్తోంది.

ప్ర: మైనార్టీ విద్యార్థులకు అందిస్తున్న సాయం గురించి ...

జ : విద్యార్థులకు అందించే సదుపాయాలు మా పరిధిలో లేవు. అవి జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అమలు చేస్తోంది. ఆ శాఖ పరంగా అందిన సమాచారం మేరకు 2022-23 వరకు జగనన్న విద్యా, వసతి పథకం క్రింద 3868 మంది విద్యార్థులకు రూ.3.72 కోట్లు నిధులు అందించారు. జగనన్న విద్యా దీవెన పథకం ద్వారా 4026 మంది విద్యార్థులకు రూ. 6.20 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. ఇదిగాక ఇమాములకు నెలకు రూ.10 వేలు, మౌజర్లకు రూ. 5 వేలు, పాస్టర్లకు రూ. 5 వేలు ప్రభుత్వం అందిస్తోంది జిల్లాలో 117 చర్చిలు, 328 మసీదులు ఉన్నాయి.

ప్ర : కేంద్రం నుంచి మైనార్టీలకు ఏలాంటి సాయం అందుతోంది.?

జ : పిఎం విశ్వకర్మ యోజన పథకం ద్వారా 18 రకాల చేతివృత్తుల వారికి రుణాలు మంజూరుకు తగిన ప్రతిపాదనలు పంపాము. ఒక్కొక్క లబ్ధిదారునికి లక్ష రూపాయల వరకు రుణ సదుపాయం ఉంది.5 శాతం వడ్డీతో 18 కంతుల్లో రుణం చెల్లించాల్సి ఉంది. పిఎం విశ్వకర్మ పథకం గురించి మైనార్టీలలో చైతన్యం తీసుకురావడానికి సచివాలయాల ద్వారా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాము.

ప్ర : మైనార్టీలకు మీరు ఇచ్చే సలహాలు ఏమిటి?

జ : మైనార్టీ వర్గాలు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు సద్వినియోగం చేసుకొని అభివృద్ధి చెందాలి. ముఖ్యంగా విద్యార్థులను బాగా చదివించి వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలి.

ప్ర : మీ శాఖలో సిబ్బంది కొరత ఉందా.?

జ : మా శాఖలో సిబ్బంది కొరత ఉంది. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలను పర్యవేక్షిస్తున్నాం. సత్యసాయి జిల్లా కొత్తగా ఏర్పడినందున ఇక్కడ కార్యాలయ ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సి ఉంది.

పోస్టర్లు విడుదల చేస్తున్న సిఐటియు, ఆశావర్కర్స్ యూనియన్ నాయకురాళ్లు

8న ఆశావర్కర్ల చలో విజయవాడ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వచ్చేనెల 8వ తేదీన ఆశావర్కర్లు చలో విజయవాడ కార్యక్రమం చేపట్టనున్నట్లు ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.నాగమణి తెలిపారు. ఈమేరకు ఆదివారం నగరంలోని గణేనాయక్ భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఇందుకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆశావర్కర్లకు కనీస వేతనం అమలు చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వానలి, గ్రూపు బీమా సౌకర్యం, ప్రభుత్వ సెలవులు మెడికల్ లీవులు ఇవ్వాలని, ఆశావర్కర్లతో విలేజ్ క్లినిక్‌లు, పిహెచ్‌సిల క్లీనింగ్ పనులను ఆపాలని డిమాండ్ చేశారు. ఆయా సమస్యల పరిష్కారానికి చలో విజయవాడ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షురాలు మాలతి, కోశాధికారి భారతి, ఉపాధ్యక్షురాలు పద్మావతి, భాగ్యమ్మ, మీనాక్షి, గాయత్రి, వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

మాటలు కాదు.. చేసి చూపుతా..

ఎంపీ తలారి రంగయ్య

ప్రజాశక్తి-కుందుర్పి

ఉద్యోగం చేసేటప్పటి నుంచి తాను మాటలు చెప్పేవాడిని కాదని, చేతల్లో చేసి చూపుతానని ఎంపీ, నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త తలారి రంగయ్య అన్నారు. ఆదివారం తూముకుంట, బెస్తరపల్లి, మహంతపురం పంచాయతీలో మండల అధ్యక్షుడు సత్యనారాయణ శాస్త్రి అధ్యక్షతన కార్యకర్తల పలకరింపు కార్యక్రమం నిర్వహించారు. నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను నేరుగా లబ్ధిదారుల ఖాతాలకే జమ చేస్తోందన్నారు. ప్రభుత్వం చేస్తున్న మంచిని గమణించి ఎమ్మెల్యేగా తనతోపాటు ఎంపీ అభ్యర్థి శంకర్‌నారాయణను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు జగన్, కొమ్మ మమత, నాయకులు బసవరాజ్, కవిత, రాధాస్వామి, కమల నాగరాజు, భీమ్‌రెడ్డి, శ్రీలక్ష్మిఅజయ్ బాబు, సుదర్శన్‌రెడ్డి, పాలాక్షి, లింగప్ప, ముజీవులా, గోపాల్, బొమ్మలింగ, తిమ్మరాజు, గంగాధర, అనుమప్ప, రాజ్‌కుమార్, రామాంజనేయులు, ఎస్.బాబు, బీటు రాము, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ తలారి రంగయ్య

'జయహో బీసీ'ని జయప్రదం చేయండి

మాజీ ఎమ్మెల్యే జితేంద్రగౌడ్

ప్రజాశక్తి-పామిడి

పట్టణ పరిధిలోని రహమత్ ఫంక్షన్ హాల్లో ఈనెల 24న నిర్వహించనున్న జయహో బీసీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని మాజీ ఎమ్మెల్యే జితేందర్‌గౌడ్ పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలోని శ్రీకాంత్‌గౌడ్ స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు కేవలం 80 రోజులు మాత్రమే ఉందని, అధికారంలోకి వచ్చేది టిడిపి ప్రభుత్వమే అని ధీమా వ్యక్తం చేశారు. కావున టిడిపి నాయకులు, కార్యకర్తలు 'బాబు షూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి అధికారంలోకి వస్తే అమలు చేయనున్న పథకాలను వివరించాలన్నారు. అంతేగాకుండా వైసిపి అరాచక పాలనపై ప్రజల్లో అవగాహన కల్పించారు. కాగా జయహో బిసి సభకు మండలవ్యాప్తంగా బీసీలందరూ పెద్దఎత్తున హాజరై జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ధర్మతేజ్‌గౌడ్, బొల్లు శ్రీనివాసరెడ్డి, లక్ష్మీనారాయణ రెడ్డి, మాజీ మున్సిపల్ ఛైర్మన్ గౌస్, టౌన్ అధ్యక్షులు రామకృష్ణ, పట్టణ ప్రధాన కార్యదర్శి వడ్డే శివకుమార్, నల్లబోతుల శ్రీనివాసులు, సుంకప్ప, రాజేష్ నాయక్, గాదిలింగప్ప గౌడ్, బి.రంగస్వామి, మండ్ల శ్రీనివాసులు, ఉప్పర రామాంజనేయులు,సూరి, బొమ్మా మోహన్, మాధవ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జితేంద్రగౌడ్

12వ పిఆర్‌సి అమలు చేయాలి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జూలై 2023 నుంచి 12వ పిఆర్‌సిని అమలు చేయాల్సిందేనని ఎపిటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.నర్సింహులు డిమాండ్ చేశారు. ఆదివారం రాప్తాడు మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు రాయల్ వెంకటేష్ ఏర్పాటు చేసిన జిల్లా సబ్ కమిటీ సంయుక్త సమావేశంలో ఆయన మాట్లాడుతూ పిఆర్‌సి కమిటీని నియమించినప్పటికీ ప్రక్రియ ఏమాత్రం ముందు కొనసాగకుండా స్తంభించిపోవడం బాధాకరమన్నారు. వెంటనే 12వ పిఆర్‌సిని అమలు చేయాలని, లేనిపక్షంలో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. పిఆర్‌సి అమలు చేయాలని ఈనెల 31న కలెక్టరేట్ ఎదురుగా ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాయల్ వెంకటేష్, సిరాజుద్దీన్, జిల్లా గౌరవ సలహాదారు బి.వెంకటేశులు, అసోసియేట్ ప్రధాన కార్యదర్శి బి.హనుమప్ప, జిల్లా ఉపాధ్యక్షులు నాగరాజు, సుభద్ర, మోహన్‌రెడ్డి, బొమ్మయ్య, సతీష్‌కుమార్, కార్యదర్శి డేనియల్, రామాంజనేయులు, రాందాస్‌రెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్లు చెన్నకేశవ, ఈరప్ప, రామ్మోహన్, అంజలీదేవి, శ్యామ్ రవి, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగిన అంగన్వాడీల సమ్మె

ప్రజాశక్తి-గుత్తి

సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మె ఆదివారం గుత్తిలో 41వ రోజుకి చేరుకుంది. సమ్మెకు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు సి.రమేష్ మద్దతు పలికారు. సమస్యలు పరిష్కరించేంత వరకూ సమ్మెను విరమించేది లేదని అంగన్వాడీలు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎపి అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ సెక్టార్ నాయకురాళ్లు కళ్యాణి, పార్వతి, శారద, గంగ, బావమ్మ, శోభారాణి, తదితరులు పాల్గొన్నారు.

పామిడి : సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో అంగన్వాడీలు చేపట్టిన సమ్మె ఆదివారం 41వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా అంగన్వాడీ జయంతి మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అంగన్వాడీలకు గ్రాడ్యుటీ ఇవ్వాలని, ఆరు నెలల నుండి పెండింగ్‌లో ఉన్న కేంద్రాల అద్దెలు, టిఎ, డిఎ బకాయిలను తక్షణమే చెల్లించాలన్నారు. ఎఫ్ఆర్ఎస్ యాప్ రద్దు చేయాలన్నారు. మినీ అంగన్వాడీ కేంద్రాలను మెయిన్ అంగన్వాడీ కేంద్రాలుగా మార్చాలన్నారు. అన్ని కేంద్రాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలన్నారు. అలాగే అంగన్వాడీలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలకు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. వెంటనే ఆయా సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వీరికి రైతుసంఘం జిల్లా కమిటీ సభ్యులు అనిమిరెడ్డి, సిపిఎం మండల కార్యదర్శి మల్లేష్ మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యాప్తంగా అంగన్వాడీలు, హెల్పర్లు పాల్గొన్నారు.

గుత్తి సమ్మె శిబిరంలో మాట్లాడుతున్న నాయకులు

పామిడిలో సమ్మె చేస్తున్న అంగన్వాడీలు

అక్రమ కేసులతో ఉద్యమాన్ని ఆపలేరు

సిపిఎం మండల కన్వీనర్ మధుసూదన్

ప్రజాశక్తి-ఉరవకొండ

సమస్యల పరిష్కారం కోసం శాంతియుతంగా సమ్మె చేస్తున్న వారిపై అక్రమ కేసులు బనాయించి ఉద్యమాన్ని ఆపలేరని సిపిఎం ఉరవకొండ మండల కన్వీనర్ మధుసూదన్, జిల్లా కమిటీ సభ్యులు రంగారెడ్డి అన్నారు. ఆదివారం ఉరవకొండలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ అంగన్వాడీలు చేస్తున్న సమ్మె శిబిరాన్ని రాత్రికి రాత్రే పోలీసులు తొలగించడం చూస్తుంటే ప్రభుత్వం నిరంకుశత్వం తెలిసిపోతుందన్నారు. న్యాయమైన సమస్యల సాధన కోసం అంగన్వాడీలు రాష్ట్రవ్యాప్తంగా 41 రోజులపాటు శాంతియుతంగా దీక్షలు చేస్తుంటే సమస్యలను పరిష్కరించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం బాధాకరమన్నారు. దీనికితోడు సీఎం పర్యటనలో భాగంగా జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి శనివారం ఉరవకొండకు వచ్చినప్పుడు అంగన్వాడీలు కాన్వాయ్‌ని అడ్డుకుంటే భయాందోళనకు గురి చేసే విధంగా దాదాపు 12 మందిపై కేసులు నమోదు చేయడం సరైన పద్ధతి కాదన్నారు. రాష్ట్రంలో అంగన్వాడీల ఉద్యమాన్ని ఆపలేని చేతకాని ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తూ నిరంకుశంగా వ్యవహరిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

అంగన్వాడీల టెంట్ ఎత్తివేయడంతో ఖాళీ ఉన్న రోడ్డు

ఆర్యవైశ్యుల అభ్యున్నతికి కృషి

పామిడి : ఆర్యవైశ్యుల అభ్యున్నతికి కృషి చేస్తానని ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షులు శిరిగుప్ప వెంకటేశ్వర్లు తెలిపారు. ఆదివారం స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆర్యవైశ్యుల సమస్యల పరిస్కారానికి సంఘం చేదోడుగా ఉంటుందన్నారు. ఈనెల 28న అనంతపురంలో నిర్వహించనున్న జిల్లా ఆర్యవైశ్య సంఘం నూతన కమిటీ అభినందన, ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరుకావాలని కోరారు. అనంతరం జిల్లా ఉపాధ్యక్షునిగా కె.నారాయణమూర్తి, సహాయ కార్యదర్శిగా ఉపేంద్ర, సభ్యులుగా రత్నప్రభాకర్, బి.వి.శివప్రసాద్‌ను ఎన్నుకుని నియామక పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో ఇల్లూరు ఉపేంద్ర, బలభద్ర మనోజ్, సుంకు రమేష్, రంగయ్య, వెంకటకృష్ణ, నల్లయ్య, సుధాకర్, అమర్నాథ్, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

సిపిఎం క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-పామిడి

మండల కేంద్రంలోని సిపిఎం కార్యాలయంలో సిపిఎం నూతనంగా రూపొందించిన క్యాలెండర్‌ను రైతుసంఘం జిల్లా కమిటీ సభ్యులు అనిమిరెడ్డి, సిపిఎం మండల కార్యదర్శి మల్లేష్ ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత ప్రజల ప్రగతిశీల, సామ్రాజ్యవాద వ్యతిరేక, విప్లవ సంప్రదాయాలను వారసత్వంగా ఏర్పడినదే కమ్యూనిస్టు పార్టీ అన్నారు. 1921లో అహ్మదాబాద్‌లో జరిగిన భారత జాతీయ కాంగ్రెస్ మహాసభలో జాతీయోద్యమంలో మొట్టమొదటిసారి సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని డిమాండ్ చేసింది కమ్యూనిస్టు పార్టీనే అని గుర్తు చేశారు. ప్రజలను ప్రజాసంఘాల్లో సమీకరించడం ద్వారానే స్వాతంత్ర్య ఉద్యమం ప్రజా ఉద్యమంగా మారుతుందని భావించిన కమ్యూనిస్టు పార్టీ ఆ దిశగా ఆనాడే కృషి చేసిందన్నారు. పెత్తందార్ల దౌర్జన్యాలు ప్రతిఘటిస్తూ పేదల పక్షాన సిపిఎం పోరాటం చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చంద్రమోహన్‌రెడ్డి, బాబా ఫక్రుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్లను విడుదల చేస్తున్న సిపిఎం నాయకులు

టిడిపి నేత మృతికి సంతాపం

ఆత్మకూరు : మండలంలోని తోపుదుర్తి గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు తోపుదుర్తి గోపాల్ మృతిచెందడంతో మాజీ మంత్రి పరిటాల సునీత నివాళులర్పించారు. శనివారం గోపాల్ మృతిచెందిన విషయం తెలుసుకున్న సునీత గ్రామానికి చేరుకుని మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి భరోసా ఇచ్చారు.

నివాళులర్పిస్తున్న మాజీమంత్రి పరిటాల సునీత

పెద్దాసుపత్రి వద్ద అన్నదానం

అనంతపురం : శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ ఛైర్మన్, ప్రపంచ తెలుగు సాహిత్య, సాంస్కృతిక అకాడమీ ఛైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ విద్య, సాహిత్య, సామాజిక సేవారంగాల్లో నిత్య కృషీవలుడు అని పలువురు వక్తలు కొనియాడారు. శ్రీశ్రీ కళావేదిక రాష్ట్ర అధ్యక్షుడు గుత్తా హరిసర్వోత్తమనాయుడు ఆధ్వర్యంలో ప్రతాప్ జన్మదిన వేడుకలను ఆదివారం పలుచోట్ల ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి వద్ద అన్నదానం చేశారు. సాహితీవేత్త డాక్టర్ కత్తిమండ ప్రతాప్ సేవలకు గుర్తింపుగా 2019లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ సాహిత్య అకాడమీ సభ్యుడిగా ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీశ్రీ కళావేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఏపీ సాహిత్య అకాడమీ విశిష్ట అవార్డు గ్రహీత పతికి రమేష్‌నారాయణ, హైకోర్టు న్యాయవాది సాకే నరేష్, సాయి ట్రస్టు అధ్యక్షులు విజయసాయి, తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం చేస్తున్న అతిథులు

పేద కుటుంబానికి సాయం

అనంతపురం : నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్టు, పుట్టినిల్లు ఆశ్రమం ఆధ్వర్యంలో ఓ పేద కుటుంబానికి ఆదివారం రూ.10వేల విలువజేసే సాయాన్ని అందించారు. ఈ సందర్భంగా ట్రస్టు ఛైర్‌పర్సన్ ఎస్.నిర్మలామురళి మాట్లాడుతూ నగరంలోని ఇందిరానగర్‌లో వృద్ధ దంపతులు బొజ్జన్న, నాగన్న కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించేవారు. అయితే బొజ్జన్నకు షుగర్ కారణంగా ఇటీవల ఓ కాలును తీసేశారు. దీంతో ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న కుటుంబానికి రెండు నెలలకు సరిపడా రూ.5వేలు విలువజేసే 26 రకాల నిత్యావసర వస్తువులు, రూ.5 వేల నగదు అందించారు. ఈ సాయానికి ఎజిఎం హుబ్లీ ఎయిర్‌పోర్టు ఆర్.శ్రీనివాస్ సహకరం అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు యమున, మురళి, తదితరులు పాల్గొన్నారు.

సరుకులు అందజేస్తున్న నిత్యసురభి ట్రస్టు ఛైర్‌పర్సన్ నిర్మలామురళి

నిరుపేదల ఆర్థికాభివృద్ధే లక్ష్యం

వికసిత్ భారత్ జిల్లా కో ఆర్డినేటర్ బంగారు మల్లారెడ్డి

ప్రజాశక్తి-కుందుర్పి

గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేదల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం పని చేస్తోందని వికసిత భారత్ జిల్లా కోఆర్డినేటర్ బంగారు మల్లారెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని జంబుగుంపల, కుందుర్పి పంచాయతీల్లో ఎంపిడిఒ లక్ష్మీనరసింహ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ పేదల కోసం తీసుకొచ్చిన పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కమలా నాగరాజు, సర్పంచి గంగాధర్, మారుతీశ్వరి రామ్మూర్తి, ఎంపిటిసి గంగమ్మ, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆదినారాయణ, అసెంబ్లీ కో కన్వీనర్, గంగాధర్, కుందుర్పి మండల అధ్యక్షుడు వెంకటేష్, వన్నూరుస్వామి, గంగాధర్, లక్ష్మీనారాయణ, మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న అధికారులు, నాయకులు

మూర్ఛవ్యాధి రోగులు జాగ్రత్తలు పాటించాలి

న్యూరాలజిస్టు గోపాలం శివన్నారాయణ

అనంతపురం కలెక్టరేట్ : మూర్ఛవ్యాధి రోగులు మందులు వాడడంతోపాటు జాగ్రత్తలు కూడా పాటించాలని ప్రముఖ న్యూరాలజిస్ట్ గోపాలం శివన్నారాయణ సూచించారు. జనవిజ్ఞాన వేదిక (జెవివి) నగర కమిటీ ఆధ్వర్యంలో టవర్‌క్లాక్ దగ్గర ఉన్న కార్యాలయంలో ఆదివారం మూర్ఛవ్యాధి శిబిరం ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా న్యూరాలజి స్పెషలిస్ట్ గోపాలం దాదాపు 120 మంది రోగులకు వైద్యసేవలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూర్ఛవ్యాధి మంత్ర, తంత్రాలు, నాటువైద్యానికి నయం కాదన్నారు. కేవలం డాక్టర్లు సూచించిన మందులనే వాడాలన్నారు. మూర్ఛ వ్యాధి ఉన్న రోగులు నీళ్లలో ఈదడం, డ్రైవింగ్ చేయడం వంటి విషయాల్లో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జెవివి కన్వీనర్ రామకృష్ణ, నగర గౌరవాధ్యక్షురాలు డాక్టర్ పి.ప్రసూన, డాక్టర్ హరికిషోర్, జెవివి నగర అధ్యక్షులు రామిరెడ్డి, ప్రసాద్‌రెడ్డి, ఎర్రిస్వామి, నూర్ మహమ్మద్, మన్సూర్, శివచరణ్, బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

మూర్ఛవ్యాధి రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తు వైద్యులు

కులగణన సర్వే పరిశీలన

పుట్లూరు : మండలంలోని అరకటివేములలో ఆదివారం చేపట్టిన కులగణన సర్వేను ఎంపిడిఒ యోగానందరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కుటుంబ సభ్యుల వివరాలను సేకరించి పక్కాగా నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఈశ్వరమ్మ, ఎఎస్ఒ విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కులగణనను పరిశీలిస్తున్న అధికారులు

రాయదుర్గంలో 'భవిష్యత్తుకు గ్యారెంటీ'

రాయదుర్గం : పట్టణంలోని 31, 32వ ఎన్నికల వార్డులో ఆదివారం చేపట్టిన 'బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ' చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీమంత్రి కాలవ శ్రీనివాసులుతోపాటు జనసేన నాయకులు ముఖ్య అతిథిగా హాజరైన ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకోవడంతో ప్రభుత్వం వైఫల్యాలను వివరిస్తూ టిడిపి అధికారంలోకి వస్తే అమలు చేయనున్న ప్రభుత్వ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో రాయదుర్గం జనసేన పార్టీ ఇన్‌ఛార్జి మంజునాథ్‌గౌడ్, టిడిపి పట్టణ అధ్యక్షుడు నాగరాజు, జిల్లా అధికార ప్రతినిధి పురుషోత్తం, మున్సిపల్ వార్డు సభ్యులు ప్రశాంతి, జ్యోతి, మాజీ సభ్యులు భారతి, హనుమంతు, తిప్పేస్వామి, తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలు అందజేస్తున్న టిడిపి నాయకులు

ఎస్కెయు విసికి సన్మానం

అనంతపురం కలెక్టరేట్ : నగరంలోని రెవెన్యూ కాలనీ, షిర్డీ నగర్‌లోని వివేకానంద యోగా కేంద్రంలో ఎస్కెయు వైస్ ఛాన్సలర్ హుస్సేన్‌రెడ్డి ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా యోగా కేంద్రం అధ్యక్షులు రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ శాంత స్వభావం కలిగిన వ్యక్తి హుస్సేన్‌రెడ్డి అని కొనియాడారు. అంతేగాకుండా మధ్య తరగతి వ్యవసాయ కుటుంబ నుంచి కష్టపడి ఈ స్థాయికి వచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ లక్ష్మయ్య, యోగా కేంద్రం సభ్యులు హనుమంతురెడ్డి, ఆంజనేయులు, దివాకర్, దాదులూరయ్య, వెంకటరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎస్కెయు విసిని సన్మానిస్తున్న యోగాకేంద్రం సభ్యులు

పూర్వ విద్యార్థుల కలయిక

గార్లదిన్నె : మండల పరిధిలోని కల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1991-1992లో పదవ తరగతి పూర్తిచేసిన విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఒకరికొకరు ఆనందం పంచుకుని యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఇందులో భాగంగా అప్పట్లో పాఠాలు చెప్పిన ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులను సన్మానించారు. తర్వాత ఆనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ ఉపాధ్యాయులు ప్రిన్సిపల్ శారద, ప్రసాద్‌రావు, అశ్వర్థ నారాయణ, చెన్నప్ప, రమాదేవి, పూర్వ విద్యార్థులు అలెగ్జాండర్, కొండూరు చిదంబరెడ్డి, శ్రీనివాసులు, మల్లేష్, సత్తిరెడ్డి, ఇస్మాయిల్, వసంత, రాజ్యలక్ష్మి, చీమల రాధా, నాగరత్నం, మస్తాన్, తదితరులు పాల్గొన్నారు.

గురువులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

నేరాలు ఘోరాలు

ఎన్టీఆర్ మార్గ్‌లో అగ్నిప్రమాదం

ఘటనా స్థలాన్ని సందర్శించిన జనసేన నాయకులు

అనంతపురం : నగరంలోని ఎన్టీఆర్ మార్గ్ రోడ్డులో ఉన్న గుజిరీ దుకాణం ఆదివారం తెల్లవారుజామున చోటు చేసుకున్న అగ్నిప్రమాదంలో పూర్తిగా దగ్ధమైంది. దీంతో గుజిరీ యజమాని లలితకు సుమారు రూ.80లక్షలు ఆస్తి నష్టం సంభవించింది. విషయం తెలుసుకున్న జనసేన పార్టీ నాయకులు గుజిరీ యజమాని లలితను పరామర్శించారు. ఈ సందర్భంగా ప్రమాదానికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వెంటనే ప్రభుత్వం స్పందించి గుజిరీ యజమానిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నగర అధ్యక్షులు బాబురావు, జిల్లా సహాయ కార్యదర్శి అవుకు విజయకుమార్, నాయకులు పవనిజం రాజు, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాద ఘటనను పరిశీలిస్తున్న జనసేన నాయకులు

హోంగార్డుపై దాడి

గార్లదిన్నె : మండల పరిధిలోని కల్లూరు గ్రామానికి చెందిన హోంగార్డు హనుమంతుపై అదేగ్రామానికి చెందిన ప్రభాకర్ ఆదివారం సాయంత్రం దాడి చేసి గాయపరిచాడు. బాధితుడు తెలిపిన వివరాల మేరకు.. హనుమంతు సాయంత్రం ఇంటి దగ్గర తన అక్క సావిత్రితో ఉండగా ప్రభాకర్ మద్యం మత్తులో తన అక్కతోపాటు విచక్షణ రహితంగా దాడి చేసి గాయపరిచాడన్నారు. వెంటనే గాయపడిన హనుమంతుని 108లో అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు గార్లదిన్నె పోలీసులు తెలిపారు. దాడి కారణాలు తెలియాల్సి ఉందన్నారు. కాగా హనుమంతు పామిడి పోలీస్‌స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్నాడు.

31న మాదిగల మహా సమ్మేళనం

ప్రజాశక్తి-గుంతకల్లు

మాదిగల హక్కుల సాధనకు జిల్లాకేంద్రంలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ భవనంలో ఈనెల 31న నిర్వహించనున్న మాదిగల మహా సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని ఎంఆర్‌పిఎస్ జాతీయ నాయకులు కెపి.నారాయణ స్వామి పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం సమీపంలో ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద సమ్మేళనానికి సంబంధించిన గోడ పత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్ల గడచినా నేటికీ దేశంలో మాదిగలు అణచివేతకు గురవుతూనే ఉన్నారన్నారు. పాలక ప్రభుత్వాలు మాదిగల హక్కుల సాధనకు అడుగడుగునా అడ్డంకులు సృష్టిస్తూ పబ్బం గడుపుకుంటున్నారన్నారు. మాదిగల హక్కుల సాధన, రాజ్యాంగ హక్కులు, రాజ్యాధికారానికి ఐక్యం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మాదిగల సత్తా చాటేందుకు జిల్లాకేంద్రంలో మాదిగల మహా సమ్మేళనం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర కార్యదర్శి మధుమాదిగ, సీనియర్ నాయకులు బంగి నాగ, జయరాం, నెరమెట్ల ఎల్లన్న, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ సభ్యుడు నరసింహులు మాదిగ, మండల నాయకులు వన్నూరప్ప, తదితరులు పాల్గొన్నారు.

గుత్తి : జిల్లాకేంద్రంలో ఈనెల 31న నిర్వహించనున్న మాదిగల మహా సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని ఎంఆర్‌పిఎస్ నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని రోడ్లు భవనాల శాఖ అతిథి గృహంలో ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షురాలు కె.సునీత ఆధ్వర్యంలో ఇందులకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ జిల్లా నాయకుడు యల్లన్న, నాయకులు పుల్లయ్య, లాలెప్ప, కేపీ. నారాయణస్వామి, సామ్రాట్ మధు, బంగి నాగ, రామాంజనేయులు, పద్మావతి, సూర్యనారాయణ, జయరాముడు, రాజేష్, మద్దిలేటి, తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ : మాదిగల మహా సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని ఉమ్మడి అనంతపురం జిల్లా మాదిగ నాయకులు పిలుపునిచ్చారు ఆదివారం ఉరవకొండలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఇందుకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ నాయకులు కెబి నారాయణస్వామి, సామ్రాట్ మధు, బంగి నాగ, నేరమెట్ల ఎల్లన్న, మీనుగ రామాంజనేయులు, మీనుగ గోపాల్, పాల్తూరు ఆనంద్‌రాజ్, లతవరం చంద్రశేఖర్, రాజ్‌కుమార్, రాము, రేణిమకులపల్లి ఓబయ్య, పృథ్వీ, సాయి, గోపాల్, మహేష్, హనుమన్న, ముష్టూరు రామకృష్ణ, మధు, రాజశేఖర్, రాము తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లులో పోస్టర్లను విడుదల చేస్తున్న ఎంఆర్‌పిఎస్ నాయకులు

కుర్ని సామాజికవర్గం అధ్యక్షులుగా హనుమంతు

రాయదుర్గం : టిడిపి కుర్ని/ నేసే/ కరికాల భక్తుల సామాజికవర్గం అధ్యక్షులుగా రాయదుర్గం పట్టణానికి చెందిన టంకశాల హనుమంతును నియమించారు. ఈమేరకు ఆదివారం టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చంనాయుడు ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో రాయదుర్గం మున్సిపల్ వార్డు సభ్యుడుగా, రాష్ట్ర చేనేత కార్పొరేషన్ డైరెక్టర్‌గా పని చేసిన హనుమంతు దీర్ఘకాలంగా చురుగ్గా పనిచేస్తున్నారు. ఆయన పార్టీకి చేసిన సేవలను గుర్తించి పార్టీ కొన్ని నేసే సామాజిక వర్గం రాష్ట్ర కన్వీనర్‌గా నియమించారు. ఈమేరకు హనుమంతును టిడిపి జిల్లా అధ్యక్షులు కాలవ శ్రీనివాసులు అభినందించారు.